



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 303 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 5 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :303 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 5 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

- జూలై 5 నుంచి 11 వరకు కొరియాలో పర్యటన
- ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా
- ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు
- సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో తమ దేశంలో పర్యటించాలని రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా)

- మిగతా 2లో




## తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?: ప్రకాశ్ రాజ్ పై కందుల దుర్గేశ్ ఫైర్

- రావణ్ కు మద్దతుగా నిలిచిన ప్రకాశ్ రాజ్
- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ వరుస ట్వీట్లు
- రావణ్ తో ఉన్న చీకటి సంబంధాలు ఏమిటో చెప్పాలని డిమాండ్



**పెన్ పవర్ డెస్క్:**యూట్యూబర్ ప్రశ్న రావణ్ (జోసెఫ్) అరెస్టుల పర్వంపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన విమర్శలకు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఘాటుగా బదులిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కావాలనే అశాంతిని, ఘర్షణ వాతావరణాన్ని రగిల్చేందుకు ఒక ముఠా ప్రయత్నిస్తోందని ఆయన

- మిగతా 2లో

## జగన్ హయాంలోనే అన్నీ జరిగితే.. చంద్రబాబు క్రెడిట్ చోరీ ఏంటి?"



- కడప స్టీల్ ప్లాంట్ పెట్టేందుకు జగన్ హయాంలోనే అన్నీ జరిగాయన్న అవినాశ్
- 2022లోనే 1100 ఎకరాల భూసేకరణ జరిగిందని వెల్లడి
- జగన్‌ను దూషించడానికే కడప సభ పెట్టినట్టుందన్న అవినాశ్

**పెన్ పవర్ డెస్క్:**"కడప స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించి భూసేకరణ, పర్యావరణ అనుమతులు, జీవోల జారీ అంతా జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జరిగితే...

- మిగతా 2లో

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

**పెన్ పవర్ డెస్క్:** వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లపై తూర్పుగోదావరి జిల్లా అధికారులతో మంత్రి నారాయణ సమీక్షించారు. గోదావరి పుష్కరాల కోసం సీఎం చంద్రబాబు రూ.1500 కోట్లు మంజూరు చేశారని అన్నారు. వీటిలో కేవలం రాజమహేంద్రవరంలో పుష్కరాల కోసమే రూ.580 కోట్ల పనులకు సీఎం అనుమతించారని చెప్పారు.

- మిగతా 2లో





## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని వెల్లడి
- పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభాన్ని వ్యూహాత్మకంగా ఎదుర్కొన్నామని స్పష్టం
- చమురు రంగ కంపెనీలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని వెల్లడి
- ఇంధనం అందించే దేశాల సంఖ్యను 40కి పెంచుకున్నామన్న మోదీ

- మిగతా 2లో

## ఆస్ట్రేలియా వస్తే చంపేస్తాం... ప్రధాని మోదీకి బెదిరింపులు

- ఆస్ట్రేలియా పర్యటనకు ముందు ప్రధాని మోదీకి ఆన్‌లైన్‌లో హత్య బెదిరింపు
- మెల్‌బోర్న్ ఈవెంట్‌కు సంబంధించిన ఫేస్‌బుక్ పోస్ట్ కింద హెచ్చరికతో కూడిన కామెంట్
- రంగంలోకి దిగిన ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు.. ఐపీ అడ్రస్ ఆధారంగా దర్యాప్తు
- ప్రధాని పర్యటన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేసిన అధికారులు
- భద్రతను కట్టుదిట్టం చేసి, విచారణను అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న పోలీసులు

2లో



## తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

### కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ ఫైర్



- రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల కుప్పగా మార్చాయన్న సంజయ్
- రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపాటు
- రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు

- మిగతా 2లో

## ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి 20 ఏళ్లు.. జడ్పీటీసీ నుంచి సీఎం దాకా!

- 2006లో మిడ్జిల్ జడ్పీటీసీగా రాజకీయ అరంగేట్రం
- తన తొలి గెలుపునకు వేదికైన మిడ్జిల్‌లో కృతజ్ఞతా కార్యక్రమం
- జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి ఎదిగిన రాజకీయ ప్రయాణం
- ప్రజల ఆకాంక్షల నెరవేర్పుకే కృషి చేస్తానన్న రేవంత్



**పెన్ పవర్ డెస్క్:** ప్రజా ప్రతినిధిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని, తన రాజకీయ జీవితానికి పునాది వేసిన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో శనివారం


- మిగతా 2లో



## ఎన్నిసార్లు అరెస్ట్ చేస్తారు?: ప్రకాశ్ రాజ్

- పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రావణ్ అలియాస్ జోసెఫ్
- కోర్టులు బెయిల్ ఇస్తున్నా ఇతర కేసుల్లో అరెస్ట్ చేస్తున్న పోలీసులు
- కూటమి ప్రభుత్వంపై ప్రకాశ్ రాజ్ విమర్శలు

- మిగతా 2లో



## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

### కీలక బిల్లులు, రాజకీయ సమీకరణాలపై ఉత్కంఠ

- జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ జరగనున్న భేటీ
- మహిళా రిజర్వేషన్, ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లులు అజెండాలో ఉండే అవకాశం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి 20 ఏళ్లు.. జడ్పీటీసీ నుంచి సీఎం దాకా!

- మొదటి పేజీ తరువాయి

ఆయన పర్యటించారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం, 2006 జులై 4న ఇదే మిడ్జిల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టారు.ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి, 2007లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, 2018 ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ పట్టువదలకుండా 2019లో మల్కాజ్‌గిరి ఎంపీగా ఘనవిజయం సాధించారు. 2021లో టీపీసీసీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టి, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

మిడ్జిల్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఉర్కొండ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తన రాజకీయ ప్రస్థానం తొలినాళ్లలో అండగా నిలిచిన మద్దతుదారులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ తన రెండు దశాబ్దాల ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు."మిడ్జిల్ రేవంత్ రెడ్డి నుంచి ప్రతి గుండెలో 'రేవంత్ అన్న' వరకు సాగిన ఈ అద్భుత ప్రయాణం నా జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయం" అని ఆయన 'ఎక్స్' వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సహా పలువురు నేతలు రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆయన ప్రస్థానానికి ఈ కార్యక్రమం అద్దం పట్టింది.

## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ఆయన్ను అధికారికంగా ఆహ్వానించింది. ఈ మేరకు ఆయన జూలై 5 నుంచి 11వ తేదీ వరకు కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్.. కొరియాలోని పలు మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక సమావేశాల్లో పాల్గొంటారు.ఈ పర్యటన ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని చెన్నైలోని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్, మంత్రి లోకేశ్ కు పంపిన ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు. భారత్-కొరియా మధ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేయడంలో ఈ పర్యటన ఒక కీలక ముందడుగు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**లోకేశ్ పర్యటన షెడ్యూల్**

జులై 5న సియోల్‌లో ఇండియా దయాస్పోరా ఏర్పాటు చేసే ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, ముఖ్యంగా తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు.

జులై 6వ తేదీన దక్షిణ కొరియాకు చెందిన టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని, పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. అనంతరం, హ్యోసంగ్ భారీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమవుతారు.

జులై 7న ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ టవర్స్‌లో కీలక సమావేశం జరగనుంది. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్ జు కోహ్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. ఈ భేటీకి ఎల్జీ అనుబంధ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాలు కూడా హాజరుకానున్నాయి.

జులై 8వ తేదీన కొరియన్ మెరైన్ అక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో భేటీ ఉంటుంది.జులై 9న కొరియన్ పొలిటికల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఢ ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగాల డిప్యూటీ మంత్రులతో వేర్వేరుగా భేటీ అవుతారు.జులై 10వ తేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడుల గురించి చర్చించడంతో పాటు, కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు.

అదే రోజు రాత్రి, విశాఖలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026ను విజయవంతం చేయాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో నిర్వహించే ప్రత్యేక రోడ్ షోలో పాల్గొంటారు. 11వ తేదీన దక్షిణ కొరియా నుంచి తిరిగి రానున్నారు. ఈ పర్యటన ద్వారా ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

## తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?: ప్రకాశ్ రాజ్ పై కందుల దుర్గేశ్ ఫైర్

- మొదటి పేజీ తరువాయి

ఆరోపించారు. మీడియా ముఖంగా ప్రకాశ్ రాజ్, రావణ్‌లపై విరుచుకుపడిన మంత్రి... వారిద్దరినీ సమాజ విద్రోహ శక్తులుగా అభివర్ణించారు. అసలు ఈ వివాదాస్పద యూట్యూబర్‌తో ప్రకాశ్ రాజ్‌కు ఉన్న చీకటి సంబంధాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎన్నో అకృత్యాలు సాగాయని, హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని.. అప్పుడు లేవని ప్రకాశ్ రాజ్ గొంతు ఇప్పుడు ఎందుకు లేస్తోందని మంత్రి కందుల దుర్గేశ్ నిలదీశారు. "నాడు మూగనోము నోమిన మీరు.. నేడు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడానికి తాడేపల్లి ప్యాలెస్ నుంచి ప్రతి నెలా ఎంత డబ్బు అందుకుంటున్నారు?" అంటూ నేరుగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించి శాంతిభద్రతలను దెబ్బతీయడానికే ఇలాంటి శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, వీటిని ప్రభుత్వం కఠినంగా అణచివేస్తుందని మంత్రి హెచ్చరించారు.

## జగన్ హయాంలోనే అన్నీ జరిగితే.. చంద్రబాబు క్రెడిట్ చోరీ ఏంటి?"

- మొదటి పేజీ తరువాయి

ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆ క్రెడిట్ నాదే అని చెప్పుకోవడం హాస్యాస్పదం" అని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి విమర్శించారు. శనివారం కడపలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం పాత ప్రాజెక్టులపై 'క్రెడిట్ చోరీ'కి పాల్పడుతోందని మండిపడ్డారు.2019లోనే జేఎస్‌డబ్ల్యూ సంస్థను కడపలో స్టీల్ ప్లాంట్ పెట్టేందుకు జగన్ ప్రభుత్వం ఒప్పించిందని అన్నారు. ఆ తర్వాత 2022లో ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన అధికారిక జీవోలను జారీ చేయడంతో పాటు, ఫేజ్-1 కింద 1100 ఎకరాల భూసేకరణను కూడా పూర్తి చేసిందన్నారు. 2023 ఫిబ్రవరిలో అప్పటి సీఎం జగన్ స్వయంగా ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని తెలిపారు. పర్యావరణ అనుమతులు సహా అన్ని క్లియరెన్సులు తమ ప్రభుత్వమే తెచ్చిందని.. ఈ విషయాన్ని జేఎస్‌డబ్ల్యూ అధినేత సజ్జన్ జిందాల్ స్వయంగా ప్రకటించారని తెలిపారు. తాజాగా కడప సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ.. ఆ సభ స్టీల్ ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం కాకుండా, కేవలం జగన్‌ను దూషించడానికే పెట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు.

ఇదే క్రమంలో అమరావతి రాజధానిపైనా అవినాశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతి అనేది రాష్ట్ర ప్రజలందరి రాజధాని కాదని, అది కేవలం ఒక వర్గానికి చెందిన రాజధానిగా మారిందని ఆరోపించారు. ఈ విషయాన్ని స్వయంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా గతంలో అంగీకరించారని అన్నారు. నాడు శివరామకృష్ణ కమిటీ ఇచ్చిన శాస్త్రీయ సూచనలను తుంగలో తొక్కిన చంద్రబాబు... ఇప్పుడు అమరావతి కోసం ఏకంగా రూ.2 లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేయాలని చూస్తున్నారన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా జగన్... మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాలను అనుసంధానిస్తూ, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే ఆచరణాత్మకమైన 'మావిగన్' నమూనాను ప్రతిపాదించారని చెప్పారు.

# కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు... వెలికితీస్తాం

తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిపే 'స్వర్ణ కుప్పం' నిర్మాణానికి నాంది పలుకుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా... రూ.118 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపో పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన చంద్రబాబు, అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూనే గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

**కుప్పంలోనూ బంగారు గనులు**

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించామని తెలిపారు. ఇప్పుడు కుప్పం ప్రాంతంలోనూ బంగారు గనులు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారని చంద్రబాబు సంచలన విషయం వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ బంగారు నిక్షేపాలను వెలికితీసి, 'స్వర్ణ కుప్పం' ఆవిష్కరణకు నిజమైన అర్థం కల్పిస్తామని ప్రకటించారు.

మైక్రో ఇరిగేషన్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచిన కుప్పం మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. హంద్రీ-నీవా జలాలతో 110 చెరువులు నింపామని గుర్తుచేశారు. రాయలసీమను ఉద్యాన హబ్?గా మార్చే 'పూర్వోదయ' ప్రాజెక్టుకు వచ్చే నెల మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు.

**ఉద్యోగాల కేంద్రంగా కుప్పం**

ఒకప్పుడు ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అదే స్థానంలో సౌర విద్యుత్ వంటి ఆధునిక సదుపాయాలతో మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా మార్చే క్రమంలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. "ఉద్యోగాల కోసం కుప్పం యువత బయటకు వెళ్లడం కాదు, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పిస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 80 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థతో పాటు టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కుప్పానికి వస్తున్నాయని వెల్లడించారు.

**కాలుష్య రహిత, సుస్థిర అభివృద్ధి**

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్, బీసీ, ఓసీలకు రూ.552 కోట్లతో సౌర విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. 'నెట్ జీరో' విధానంలో భాగంగా ఇళ్లపైనే కూరగాయలు పండించుకోవడం, ఈ-సైకిళ్ల వాడకం పెంచి కుప్పాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 'హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కుప్పంపై కక్ష కట్టిందని, అభివృద్ధిని అడ్డుకుందని చంద్రబాబు ఆరోపించారు. "నీళ్లు తెచ్చామని సినిమా సెట్టింగులు వేసి డ్రామాలు ఆడారు. 2019-24 మధ్య నన్ను నా నియోజకవర్గంలోనే తిరగనివ్వకుండా అడ్డంకులు సృష్టించారు. నాకు సహకరించిన వారిని వేధించారు" అని మండిపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇప్పుడు అభివృద్ధే తమ అజెండా అని స్పష్టం చేశారు. సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య, కోడికత్తి డ్రామా, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఘటనలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు.

**'మావిగన్' అంటూ గొడ్డలి పార్టీ వింత వాదన**

రాజధానిపై గత ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడిందని విమర్శించారు. ప్రజలందరూ అమరావతినే రాజధానిగా కోరుకుంటుంటే, 'గొడ్డలి పార్టీ' మాత్రం వాటికన్ తరహాలో 'మావిగన్' కావాలంటోందని ఎద్దేవా చేశారు. గొడ్డలి పార్టీ అని తాము అనడం కాదని, వారే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

కుప్పం అభివృద్ధికి సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ వంటి సంస్థల సహకారంతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజా భాగస్వామ్యంతో కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సరైన సమయంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, వ్యూహాత్మక ప్రణాళికలు మరియు పటిష్ఠమైన దౌత్యం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. శనివారం రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లాలో ఒక భారీ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు."నవ భారత సంకల్పం, కృషితో 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని మనం అధిగమించాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఇంధన సరఫరాకు తీవ్ర విఘాతం ఏర్పడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి, జాతీయ వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దౌత్య సంబంధాల ద్వారా చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.ఇంధన సంక్షోభం తలెత్తిన సమయంలో

వినియోగదారులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని, ప్రభుత్వం వారికి పూర్తి అండగా నిలిచిందని ప్రధాని వివరించారు. దౌత్యపరమైన చొరవతో, మనకు ఇంధనం అందించే దేశాల సంఖ్యను 25 నుంచి 40కి పెంచుకున్నామని, దీనివల్ల దేశంలో ఎక్కడా కొరత ఏర్పడకుండా చూడగలిగామని తెలిపారు. కొందరు ప్రతిపక్ష నేతలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రభుత్వం తెరవెనుక చేసిన కృషి చరిత్రాత్మకమని వ్యాఖ్యానించారు. ఈ విజయం 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని ఆయన కొనియాడారు.

## ఎన్నిసార్లు అరెస్ట్ చేస్తారు?: ప్రకాశ్ రాజ్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చలకూరి జోసెఫ్)పై ఏపీలో పలు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. బెయిల్ పై అతడు బయటకు వస్తున్నప్పటికీ... ఇప్పటికే నమోదైన ఇతర కేసుల్లో మళ్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. దీనిపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను ట్యాగ్ చేస్తూ ఆయన విమర్శనాత్మకంగా ట్వీట్ చేశారు."అరెస్ట్.. బెయిల్.. అరెస్ట్.. బెయిల్.. అరెస్ట్.. బెయిల్.. మళ్లీ అరెస్ట్. మీరు తప్పు చేస్తున్నారని మీకు కోర్టులు స్పష్టంగా చెప్పడం లేదా? మీ కక్షపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు" అంటూ ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. "ప్రశ్నించే వారిని అధికారాన్ని దుర్వినియోగం చేసి అణచివేయడం ఎంతవరకు సాగుతుంది? కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే మరో కేసు తెరిచి వేధించడం సిగ్గుచేటు" అని మండిపడ్డారు. రావణ్ ఏలూరులో పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన తర్వాత పిఠాపురం పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

కాకినాడ కోర్టు బెయిల్ మంజూరు చేయగా, వెంటనే సర్పవరం పోలీసులు మరో పాత కేసులో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రావణ్‌పై మొత్తం 30 కేసులు ఉన్నాయని, ఇది స్పష్టమైన ప్రతీకార చర్య అని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. జనసేన కార్యకర్తలు పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న ఘటనను కూడా ఆయన ప్రస్తావిస్తూ... ప్రశ్నిస్తే చంపేస్తారా? అని ప్రశ్నించారు.

## ఆస్ట్రేలియా వస్తే చంపేస్తాం... ప్రధాని మోదీకి బెదిరింపులు

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా పర్యటనకు కొద్ది రోజుల ముందు ఆన్‌లైన్‌లో హత్య బెదిరింపు రావడం కలకలం రేపింది. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు (ఏఎఫ్‌పీ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాని మోదీ పర్యటనను, ప్రవాస భారతీయులతో జరగనున్న భారీ కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ బెదిరింపు వెలువడింది.

వివరాల్లోకి వెళితే, ప్రధాని మోదీ జూలై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' అనే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమ ప్రచారంలో భాగంగా ఫేస్‌బుక్‌లో పెట్టిన ఒక పోస్ట్ కింద 'అబు ముస్తఫా' అనే ఖాతా నుంచి బెదిరింపు కామెంట్ వచ్చింది. "ఈవెంట్ సమయంలో స్టేడియం పైకప్పులు మూసి ఉంచడం మంచిది. లేదంటే, ఆయన తన చావు కోసమే ఆస్ట్రేలియాకు వస్తున్నట్లు అవుతుంది" అని ఆ కామెంట్‌లో పేర్కొన్నారు.ఈ విషయం జూలై 3న ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసుల దృష్టికి వెళ్ళింది. వెంటనే రంగంలోకి దిగిన దర్యాప్తు అధికారులు, బెదిరింపు పోస్ట్ చేసిన ఖాతాకు సంబంధించిన ఐపీ అడ్రస్‌ను గుర్తించినట్లు సమాచారం. అయితే, దర్యాప్తు కొనసాగుతున్నందున ఈ విషయంపై పూర్తి వివరాలు వెల్లడించడానికి ఏఎఫ్‌పీ నిరాకరించింది.

ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేసినట్లు ప్రకటించలేదు.ఆస్ట్రేలియా-భారత్ వార్షిక నాయకత్వ సదస్సు కోసం ప్రధాని మోదీ జూలై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో రక్షణ, భద్రత, వాణిజ్యం వంటి కీలక అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈ బెదిరింపు నేపథ్యంలో ఆస్ట్రేలియా భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ప్రధాని మోదీ పర్యటనకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, ఆయన పర్యటన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండబోవని అధికారులు స్పష్టం చేశారు.

## తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

- మొదటి పేజీ తరువాయి

అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు.రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ.10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు.పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి

పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన... వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే... దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 20వ తేదీ నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి ఆమోదం తెలిపారని రిజిజు వివరించారు. మొత్తం నాలుగు వారాల పాటు జరిగే ఈ సెషన్‌లో 19 రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి.ఈసారి వర్షాకాల సమావేశాలు మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో వాడీవేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్ష కూటమిలో నెలకొన్న విభేదాలు, అధికార ఎన్డీయే బలాన్ని పెంచే పరిణామాలు ఈ సెషన్‌పై ప్రభావం చూపనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ ఎంపీలు ఎన్‌సీపీఐలో విలీనం కావడం, ఉద్ధవ్ థాకరే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడం వంటి అంశాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలతో పార్లమెంటులో ఎన్డీయే బలం మరింత పెరగనుండగా, విపక్ష 'ఇండియా' కూటమి బలహీనపడనుందని అంచనాలు వెలువడుతున్నాయి.మరోవైపు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకేతో పొత్తు పెట్టుకోవడంతో డీఎంకే తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు కాంగ్రెస్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరుతూ డీఎంకే ఇప్పటికే స్పీకర్‌కు లేఖ రాసింది. ఈ పరిణామాలన్నీ సభలో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

**ప్రభుత్వ అజెండాలో కీలక బిల్లులు**

ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత సమావేశాల్లో తిరస్కరణకు గురైన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఈసారి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు వరుసగా 30 రోజులకు మించి జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారి పదవులు వాటంతట అవే రద్దయ్యేలా నిబంధనలు తీసుకొచ్చే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

అలాగే, దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' బిల్లు కూడా కేంద్రం అజెండాలో ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, యాంటీ-డోపింగ్ బిల్లులను కూడా సభ ముందుకు తీసుకురావడానికి రంగం సిద్ధమైంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లుతో పాటు వేతన నియమావళి, కార్పొరేట్ లా, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు చట్ట సభల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

- మొదటి పేజీ తరువాయి

'పుష్కరాలకు రాజమహేంద్రవరంలో కల్పించాల్సిన సదుపాయాలపై చర్చించాం. పనులు వెంటనే ప్రారంభించాలన్న సీఎం ఆదేశాల మేరకు చేపట్టాల్సిన పనులు నిర్ణయించాం. ప్రస్తుత నిధులతో తొలిదశ పనులు ప్రారంభిస్తున్నాం. రాజమహేంద్రవరంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మిస్తాం. గోదావరిలో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకుంటాం. రాజమహేంద్రవరంలో డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం రూ.140కోట్లతో పనులు ప్రారంభిస్తాం.. రోడ్ల నిర్మాణం, విస్తరణ, లైటింగ్ పనులు చేపడతాం. టీడీఆర్ బాండ్లు జారీ చేసి, నగరంలో రోడ్ల విస్తరణ త్వరలో చేపడతాం. గోదావరి కాలుష్య నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నిధులు కేటాయిస్తాం. ఘాట్ల ఆధునికీకరణ, విస్తరణను ఇరిగేషన్ శాఖ నిధుల ద్వారా అభివృద్ధి చేస్తాం" అని నారాయణ అన్నారు.

# పీ జీ ఆర్ ఎస్ నూతన భవనానికి శంకుస్థాపన



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూలై 4**

మార్కాపురం కలెక్టరేట్లో నూతన పీ జీ ఆర్ ఎస్ భవనానికి జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం పీజీ ఆర్ ఎస్ కార్యక్రమానికి కలెక్టరేట్ కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ నూతన భవనం ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా కలెక్టరేట్ లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. అందులో భాగంగా ఇప్పటికే హార్టికల్చర్ హబ్ లో ఈ ప్రాంతాన్ని చేర్చిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా వెలుగొండ ప్రాజెక్టు సైతం త్వరలో పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజల కలను సహకారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, వెలుగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబు తాలిం, భాజపా అధికార ప్రతినిధి వై.రామచంద్రారెడ్డి, చెన్నకేశవ స్వామి దేవస్థానం ఈవో శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## మార్కాపురం - ప్రకాశం

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం..!




**నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల బస్సులు**

**బస్సు ముందు భాగంలో అద్దం లేకుండానే రోడ్డుపైకి బడి బస్సు**

**బస్సులో సుమారు 50 మందికి పైగా విద్యార్థులు**

**పిల్లల ప్రాణాలతో చెలగాటం వద్దని తల్లిదండ్రుల వేడుకోలు**

**పట్టించుకోని ఆర్టిఏ అధికారులు**

**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూలై 4**

విద్యార్థులను సురక్షితంగా పాఠశాలకు, పాఠశాల నుండి ఇంటికి చేర్చాల్సిన స్కూలు బస్సులు పరిస్థితి చూస్తుంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బస్సుల కండిషన్, అనుభవంతమైన డ్రైవింగ్, ఫిట్నెస్ వంటివి పాఠశాల విద్యార్థుల ప్రయాణ భద్రతకు అత్యంత కీలకం. కానీ కొన్ని పాఠశాలల బస్సుల విషయంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ముందు భాగం అద్దం లేకుండానే విద్యార్థులను తరలిస్తూ ఉంది. ఓవైపు వర్షం , మరోవైపు చలిగాలితో విద్యార్థులు వనికిపోతున్నారు. అయినప్పటికీ స్కూల్ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు పాఠశాలల నిర్లక్ష్యానికి ఈ బస్సు ఓ ఉదాహరణ. దీనిని బట్టి చూస్తే అధికారులు ఏమాత్రం తనిఖీ చేస్తున్నారో అర్థమవుతుంది. ప్రైవేట్ పాఠశాలల యజమాన్యం విద్యార్థుల అడ్మిషన్లు, ఫీజులపై ఉన్న శ్రద్ధ వారు ప్రయాణించే బస్సులపై లేకపోవడం గమనార్హం. విద్యా సంస్థల ప్రారంభానికి ముందే బస్సులను కండీషన్లో ఉంచుకోవాల్సిన యాజమాన్యాలు తనిఖీలు చేస్తే గానీ పట్టించుకునే పరిస్థితి లేదు. జిల్లాలోని పలుచోట్ల అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి.




తమ పాఠశాలల్లో చేరాలని వేలకు వేలు ఖర్చుచేస్తూ జోరుగా ప్రచారం నిర్వహించే పాఠశాలల యాజమాన్యాలు.. విద్యార్థులను తరలించే బస్సుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికా రులు ప్రైవేట్ స్కూల్ బస్సుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

# తరతరాలకు తరగని పోరాట స్ఫూర్తి అల్లూరి

## - రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 04**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. శనివారం ఆయన 129వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని గుంటూరు రోడ్డులో ఉన్న విగ్రహానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బి.ఎన్. విజయ్ కుమార్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్, ఇతర ప్రముఖులతో కలిసి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీతారామరాజు స్వగృహాన్ని తాను గత ఏడాది సందర్శించానని చెప్పారు. దానిని వారసత్వ స్మారక స్థూపంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి కూడా సీతారామరాజు పేరు ప్రభుత్వం పెట్టిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ధైర్యంగా ముందుకుసాగిన అల్లూరి జీవితం, పోరాట స్ఫూర్తి భావితరాలకు తెలియచేయాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. ఎంపీ మాట్లాడుతూ అల్లూరి ఆశయ సాధన కోసం గిరిజనుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. రియాజ్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం యువతలో చైతన్యం నింపి పోరాట బాట పట్టించిన గొప్ప యోధుడు అల్లూరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి.వెంకటరమణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, స్టెప్ సీఈఓ అర్జున్ నాయక్, పిడిసిసి బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# 10న జోయలుక్కాస్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 04**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ప్రముఖ ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రత్యేక నియామక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె. రవితేజ తెలిపారు. ఈ నియామక కార్యక్రమం 2026 జూలై 10వ తేదీ (శుక్రవారం) ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు జోయాలుక్కాస్ జ్యువెలరీ షోరూమ్, ౦37-1-169/58, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, కర్నూలు రోడ్, ఒంగోలు లో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ నియామకాలలో పురుషులకు 250 పోస్టులు, మహిళలకు 50 పోస్టులు అందుబాటులో ఉన్నాయని, ఫ్రెషర్స్.. అనుభవం ఉన్న అభ్యర్థులు ఇద్దరూ దరఖాస్తు చేసుకోవచ్చు అని పేర్కొన్నారు.

**అభ్యర్థుల విద్యార్హత:** ఏదైనా డిగ్రీ / ఇంటర్మీడియట్ / డిప్లొమా, వయస్సు: 25 సంవత్సరాలలోపు పురుషులు, మహిళలు ఇద్దరూ అర్హులే అని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు పరిశ్రమలో అత్యుత్తమ వేతనం, సేల్స్ ఇన్సెంటివ్స్, బోనస్, సెలవు సౌకర్యాలు, గ్రాట్యుటీ, ఈఎస్ఐ, పీఎఫ్, ఉచిత వసతి, భోజన సౌకర్యం, రూ.4 లక్షల మెడిక్లెయిమ్ బీమా, రూ.5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా, రూ.17 లక్షల గ్రూప్ టర్మ్,ఈడిఎల్ఐ బీమా వంటి అనేక సౌకర్యాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్సైట్ యందు రిజిస్ట్రేషన్ చేసుకుని తమ పూర్తి బయోడేటా, విద్యార్హతల ధృవపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ౦91 79 8924 4381 నంబర్లను సంప్రదించవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సూచించారు.

# కందుకూరు ఏఎంసి పీఠంపై తొలిసారిగా దళిత మహిళ

## -అభివృద్ధిలో కందుకూరు దూసుకుపోతోందన్న మంత్రులు -నాగేశ్వరరావు స్పీడును అందుకోలేకపోతున్నాం -ఎమ్మెల్యేలు

**కందుకూరు పెన్ పవర్, జూలై 4:**

కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార వేడుక శనివారం అట్టహాసంగా జరిగింది. చైర్ పర్సన్ గా రాయపాటి సుభాషిని (ఓగూరు), వైస్ చైర్మన్ గా పొట్టేళ్ల మురళి (చేవూరు), డైరెక్టర్లుగా కొత్తూరి వెంకట సుధాకర్ (కందుకూరు), చిరుతోటి బాలకోటయ్య (లింగసముద్రం), కూచిపూడి కరుణయ్య (అమ్మపాలెం-బిజెపి), వక్కలగడ్డ మణికంఠ పవన్ కుమార్ (ఉలవపాడు-జనసేన), కత్తి వెంకటేశ్వర్లు (కరేడు), అమ్మనబ్రోలు మాధవ (ఉలవపాడు), షేక్ సుల్తాన్ బాషా (తెట్టు), దివి వెంకట శేషమ్మ (గుడ్లూరు), మేకల విజయ (చినలాటరిపి), కడియాల సుబ్బారావు (చాగొల్లు), పోలుబోయిన రత్నకుమారి (కరేడు), మాధవరం రాధమ్మ (చినపవని), మాదాల వెంకటేశ్వర్లు (కొల్లగుంట), ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఘట్టమనేని లక్ష్మీనరసింహం ( పోకూరు - సొసైటీ చైర్మన్) లు ప్రమాణ స్వీకారం చేశారు. వీరందరితో ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి నేతలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ చక్కగా బాధ్యతలు నిర్వర్తించి ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. స్థానిక ఏఎంసీను నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టేలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏఎంసి కార్యాలయాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చారని మంత్రి ఆనం విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే అడగగానే, దేవాదాయ శాఖ ద్వారా కందుకూరు నియోజకవర్గంలో అనేక ఆలయాల పునర్నిర్మాణం, రిపేర్లు, ధూప దీప నైవేద్యాల కోసం నిధులు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో నియోజకవర్గానికి చంద్రబాబు తీసుకొచ్చిన ఏషియన్ పల్ప్ పేపర్ పరిశ్రమను తరిమి వేశారని గుర్తు చేశారు. రామాయపట్నం పోర్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు మళ్లీ పూర్తి చేస్తున్నారని చెప్పారు. అలాగే బీపీసీఎల్, ఇండోసోల్ లాంటి భారీ పరిశ్రమల తో పాటు అనుబంధ పరిశ్రమలు కూడా ఇక్కడ ఏర్పాటు అవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో కందుకూరు, దొనకొండ, కనిగిరి ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందబోతున్నాయని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలులో రాజీలేదని, ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి స్వామి వెల్లడించారు.ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ యువకుడిగా శాసనసభకు ఎన్నికై, ప్రజల మన్ననలు పొందుతున్నారని ప్రశంసించారు. గతంలో ఎంపీగా తాను చూసిన కందుకూరుకు, ఇప్పటికి ఎంతో తేడా కనిపిస్తుందన్నారు. రాబోయే మూడేళ్లలో కందుకూరులో అగ్రస్థానంలో నిలిపేలా ఎమ్మెల్యే నాగేశ్వరరావు తప్పక పనిచేస్తారని, ప్రజలు ఆయనకు అండదండలు అందించాలని శ్రీనివాసులు రెడ్డి కోరుతూ ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ మాట్లాడుతూ నాగేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బడుగు బలహీన వర్గాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. మంత్రులు చుట్టూ తిరిగి, నిధులు రాబట్టడంలో చాకచక్యంగా వ్యవహరిస్తున్నారని పొగిడారు. ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే నాగేశ్వరరావుతో పోలిస్తే తాము అభివృద్ధిలో వెనుకబడిపోయామని సరదాగా వ్యాఖ్యానించారు. కందుకూరు మున్సిపాలిటీలో 110 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరగటం ఆశ్చర్యంగా ఉందని, వాటిలో సగం కూడా తాము తీసుకురాలేకపోయామని అన్నారు. ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా దొరకటం కందుకూరు ప్రజల అదృష్టమని ఆయన అన్నారు. మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పటికీ, అభివృద్ధిలో మాత్రం ముందంజలో ఉన్నాడని చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ మొదటినుంచి కందుకూరు, కొండపి నియోజకవర్గాలకు దగ్గర సంబంధాలు ఉన్నాయని అన్నారు. కందుకూరులో అభివృద్ధిని ప్రత్యక్షంగా చూస్తున్నానని అన్నారు. రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి, యువత భవిష్యత్తును మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. అలాగే కూటమి పార్టీల నాయకులందరూ ఐకమత్యంతో పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధించాలని జనార్ధన్ పిలుపునిచ్చారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ నాగేశ్వరరావు మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనా, తమలాంటి సీనియర్లతో పోటీపడి పనిచేస్తున్నారని పొగడ్తలతో ముంచెత్తారు. దళిత మహిళకు ఏఎంసీ పదవి కట్టబెట్టడం గొప్ప విషయం అన్నారు. ఎమ్మెల్యేగా అయినప్పటి నుంచి నాగేశ్వరరావు పట్టుదల, కృషి దగ్గరుండి గమనిస్తున్నామని, ఆయనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే కందుకూరు నియోజకవర్గం దశ మారుతుందని అన్నారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ప్రగతి పథంలో నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తుంటే జగన్ మాత్రం ప్రజలు ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే పనిలో ఉన్నాడని విమర్శించారు. ఆ మాయమాటలు నమ్మి జగన్ కు మళ్లీ అధికారం ఇస్తే, ఎక్కువగా నష్టపోయేది వెనుకబడిన వర్గాలేన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ రాయపాటి సుభాషిని పుట్టిల్లు, తమ ప్రాంతంలోని సూరారెడ్డిపాలెం అని, మా ప్రాంత ఆడపడుచు కందుకూరులో చైర్ పర్సన్ గా నియమితులవడం సంతోషంగా ఉందన్నారు. రామాయపట్నం పోర్టు, బిపిసిఎల్, ఇండోసోల్, ఇంకా అనేక పరిశ్రమల ఏర్పాటుతో కందుకూరు నియోజకవర్గ భవిష్యత్తు మారబోతోందని సత్య పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు ఏఎంసి చైర్మన్ గా గతంలో 9 మంది పనిచేస్తే, తెలుగుదేశం ప్రభుత్వాల హయాంలో ముగ్గురికి అవకాశం కలిగిందన్నారు. వారిలో గుడ్లూరు మండలంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన జనిగర్ల యానాదయ్యను చైర్మన్ గా నియమించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిది అన్నారు. ఇప్పుడు దళిత మహిళకు తమ ప్రభుత్వం పట్టం కట్టిందని, అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి నారా లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిపై ఎమ్మెల్యే మండిపడ్డారు. నోటికి ఇష్టం వచ్చినట్లు తమ నాయకులను విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. నకిలీ మద్యం వ్యాపారం, కోర్టులో ఫైళ్ల దొంగతనం లాంటి నీచమైన పనులు చేసిన గోవర్ధన్ రెడ్డి, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. మావిగన్ నినాదం నెత్తికి ఎత్తుకున్న జగన్మోహన్ రెడ్డికి ఈసారి ఆ 11 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. వైసీపీ అధికారంలోకి రావటం జరిగే పనికాదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రులు ఆనం, స్వామి సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వారిద్దరి సహాయ సహకారాలతో ముందుకు వెళతానని చెప్పారు. అంకమ్మ తల్లి ఆలయం చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ద్వారా నెలకు 3 లక్షల ఆదాయం సమకూరుస్తున్నానని చెప్పారు. అనేక అభివృద్ధి పనులతో, మాలకొండ దేవస్థానాన్ని గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దబోతున్నట్లు నాగేశ్వరరావు వెల్లడించారు. ఏఎంసీ నూతన పాలకమండలికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ... రైతులకు మేలు జరిగేలా పనిచేయాలని సూచించారు.







ప్రమాణ స్వీకార మహోత్సవానికి తరలివచ్చిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. యువ నాయకుడు నారా లోకేష్ సహాయ సహకారాలతో కందుకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళతానని స్పష్టం చేశారు.ఎర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి కృషి చేస్తుందని, స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబు దళితుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు శ్రావణి రెడ్డి , పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర కమిటీ నాయకులు బెజవాడ ప్రసాద్, గొట్టిపాటి హరికృష్ణ, కూనం నరేంద్ర, షేక్ రఫీ, పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కమిటీ సభ్యులు షేక్ రూబీ, మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, నార్నే రోశయ్య, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీను, బిజెపి నాయకులు మురళి, జనసేన నాయకులు మదన్, కళ్యాణ్, నియోజకవర్గ కమిటీల నాయకులు కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, షేక్ మున్నా, అల్లం వెంకటేశ్వర్లు, పొడపాటి మహేష్, ముచ్చు శ్రీను, ముచ్చు వేణు, ముచ్చు లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటిన విద్యార్థుల ఉపాధ్యాయుల ముఖ చిత్రాలతో నోటు పుస్తకాల పంపిణి

– డాక్టర్ చాపల వంశీ కృష్ణ,. డాక్టర్ చాపల శాంతకుమారి వెల్లడి






**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 04**

ఒంగోలు, కొత్తపట్నం ప్రభుత్వ పాఠశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి పేద విద్యార్థులకు ఉచితంగా అందజేయడానికి శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ చాపల శాంత కుమారి, డాక్టర్ చాపల వంశీ కృష్ణ మూడు వేల నోటు పుస్తకాలను ప్రత్యేకంగా రూపొందించారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపే ఉద్దేశంతో 2025--26 విద్యా సంవత్సరంలో అత్యధిక హాజరు.. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఫోటోలు, ఉత్తమ, ఆదర్శ ఉపాధ్యాయుల ఫోటోలు, అలాగే పదో తరగతిలో ఈ సంవత్సరం జిల్లాలో మెరిసిన ఉత్తమ విద్యార్థుల ఫోటోలను కవర్ పేజీల మీద అందంగా ముద్రించారు. విద్య, ఆరోగ్యం సమాజ అభివృద్ధికి ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తున్న శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, గత పది సంవత్సరాలుగా వేలాది నోటు పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేస్తూ ఉంది.

## మీ ఓటు హక్కును భద్ర పరుచుకోండి

రాష్ట్ర వైస్సార్సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జులై 4**

ప్రతి ఒక్కరు వజ్రాయుధం లాంటి తమ ఓటు హక్కును యస్ ఐ ఆర్ ప్రక్రియలో భద్ర పరుచుకోవాలని రాష్ట్ర వైస్సార్సీపీ అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం పట్టణ, మండల బి యల్ ఓ, బి యల్ ఎ లతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం తెచ్చిన యస్ ఐ ఆర్ ప్రక్రియ క్షేత్ర స్థాయిలో ఎదురుకుంటున్న సమస్యలపై వివరించారు.వైస్సార్సీపీ మద్దతు దారుల ఓట్లను తొలగించకుండా బి యల్ ఎ లు అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లకు అవగాహనకల్పించాలని సూచించారు.సంచార జాతుల, వలస కూలీలు వారి ఓటు హక్కు కోల్పోకుండా బి యల్ ఎ లు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమం లో వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వనాధ్, బి యల్ ఎ యక్కలి రాంబాబు, బి యల్ ఓ లు, నాయకులు, పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధరలు కల్పించడం లేదంటూ పొదిలిలో పొగాకు రైతుల నిరసన



**పొదిలి, పెన్ పవర్, జులై 4**

తమకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదంటూ పొదిలిలో పొగాకు రైతులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం నాడు స్థానిక పొగాకు బోర్డు లో పొగాకు రైతులు వేలం కార్యక్రమాన్ని అడ్డగించడంతోపాటు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పొగాకు రైతులు వ్యాపారులు, పొగాకు బోర్డు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో గల ప్రధాన రహదారిపై బైఠాయింపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే పొదిలి సీఐ రాజేష్ జోక్యం చేసుకొని పొగాకు రైతులతో మాట్లాడి వారికి సర్ది చెప్పి, నిరసన కార్యక్రమాన్ని విరమింప చేశారు. అనంతరం పొగాకు బోర్డు అధికారులు, వ్యాపారులతో కూడా సిఐ రాజేష్ మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. పొదిలి సి ఐ రాజేష్ జోక్యంతో రైతులు తమ ఆందోళన కార్యక్రమాన్ని విరమింప చేసుకున్నారు.

# హ్యాపీ బర్త్ డే ఎమ్మెల్యే సార్

-ఘనంగా ఎమ్మెల్యే ఇంటూరి పుట్టినరోజు వేడుకలు

-కేక్ కటింగ్ లు - అన్నదానాలు - సేవా కార్యక్రమాలు -అభిమాన నేతకు శుభాకాంక్షల వెల్లువ








**కందుకూరు పెన్ పవర్, జూలై 4**

కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం సందడిగా జరిగాయి. అభిమాన నాయకుడికి శుభాకాంక్షలు తెలియజేసేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు, అధికారులు పోటీపడ్డారు.శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు, ఎమ్మెల్యే స్వగ్రామం బడేవారిపాలెంలో పండుగ వాతావరణం కనిపించింది. నియోజకవర్గంలోని పలువురు నేతలు కేకులు తీసుకొచ్చి ఎమ్మెల్యే చేత కట్ చేయించి, ఆయనకు తినిపించారు. బర్త్ డే విషెస్ తెలియజేశారు.

అదే సమయంలో కందుకూరులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శనివారం ఉదయం కందుకూరులోని టిడిపి కార్యాలయంలో, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , నియోజవర్గ పరిశీలకురాలు శ్రావణి రెడ్డి తదితర నేతలు ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ నుంచి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ కు చేరుకున్న ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు వందల మంది క్యూ కట్టారు. పోలీసు, రెవిన్యూ, వ్యవసాయం, జిరాంజీ, ఎక్సైజ్, ఉపాధ్యాయులు, ఇంకా వివిధ శాఖల ఉద్యోగులు, జరుగుమల్లి మండల టిడిపి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబ, ఇంకా పలువురు ఎమ్మెల్యే ని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

గుడ్లూరు మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 50 కిలోల భారీ కేక్ తెప్పించి ఎమ్మెల్యే చేత కట్ చేయించారు. తర్వాత ఏఎంసి నూతన పాలకమండలి ప్రమాణస్వీకార వేదికపై, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రత్యేకంగా కేక్ తెప్పించి ఎమ్మెల్యే చేత కట్ చేయించారు. అలాగే ఇంటూరి అభిమానుల ఆధ్వర్యంలో కూడా ఇదే కార్యక్రమం జరిగింది.

సభా వేదికపై ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యులు, వివిధ పదవుల్లో ఉన్న కూటమి పార్టీల నేతలు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఇక పట్టణంలోని అన్న క్యాంటీన్ లో చైర్మన్ ఉన్నం కొండలరావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించడంతోపాటు రాత్రి పూట ఉచితంగా అన్న సేవ చేశారు. కందుకూరులోని స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఐ ఎన్ ఆర్ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. టీం సభ్యులు నల్లూరి సూర్యనారాయణ, సవిడిబోయిన వెంకటకృష్ణ, నాదెండ్ల మధు, మచ్చా మనోహర్, పీలా శ్రీను, గుమ్మా శివ, డాక్టర్ పవన్, భవనాసి వెంకటేశ్వర్లు, అత్తంటి శివకృష్ణ, నీలిశెట్టి శివరామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పిల్లలకు తినిపించారు. వలేటివారిపాలెం మండలం బడేవారిపాలెం ఎస్సీ కాలనీలో టిడిపి నాయకుడు కోరుకొండ అంజిబాబు ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్వాడి చిన్నారులకు నోటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇంటూరి శంకరయ్య, తానికొండ శ్రీను, కొమ్మి కృష్ణ, దార్ల సుబ్బారావు, లింగాబత్తిన మాల్యాద్రి, పత్తిపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల ఐక్యతే సమాజ అభ్యున్నతికి బాట

## ఈదుమూడి మహాసభను విజయవంతం చేయాలి: పీటర్ మాదిగ



**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 4**

మాదిగ సమాజ ఐక్యతతోనే సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత సాధ్యమవుతుందని మార్కాపురం జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పీటర్ మాదిగ అన్నారు. ఈ నెల 7వ తేదీన ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో నిర్వహించనున్న మాదిగల పుణ్యక్షేత్రం శంఖుస్థాపన మహోత్సవ మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ మహాసభకు సంబంధించిన గోడపత్రికను శనివారం పుల్లలచెరువు మండల కేంద్రంలో పీటర్ మాదిగ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదిగ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర చర్చ జరిపి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు ఈ సభ వేదిక కానుందని తెలిపారు.సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మాదిగలకు తగిన ప్రాధాన్యం దక్కేలా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు ఎస్సీ వర్గీకరణ అంశంపై సమాజంలో మరింత చైతన్యం తీసుకురావడమే ఈ సభ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఇటీవలి కాలంలో దళిత క్రైస్తవులపై దాడులు పెరిగాయని ఆరోపిస్తూ, వారికి ప్రభుత్వం భరోసా కల్పించాలని, 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను రద్దు చేసి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 25ను పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. మాదిగ సమాజ అభ్యున్నతి కోసం కుల, ప్రాంత, రాజకీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ఈదుమూడి గ్రామానికి తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు.మాదిగల హక్కుల సాధన, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా--ఉపాధి అవకాశాలు, రాజ్యాంగ పరిరక్షణ, ఎస్సీ వర్గీకరణ తదితర కీలక అంశాలపై సభలో విస్తృతంగా చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహాసభ ద్వారా సమాజంలో ఐక్యత, చైతన్యం, ఉద్యమ స్ఫూర్తి మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి పల్లె వెంకటయ్య, నందిగాం సామ్యూల్, బడిపాటి పెద్దోడు, పుల్లలచెరువు యువసేన అధ్యక్షుడు రావూరి బన్నీ, లింగంగుంట్ల అభిషేక్, రావూరి బాదరయ్య, బడిపాటి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# అల్లినగరంలో పేకాట శిబిరంపై పోలీసుల ఆకస్మిక దాడి

## ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 10,580 రూపాయలు స్వాధీనం



**కొమరోలు పెన్ పవర్ జూలై 4**

కొమరోలు మండలం అల్లినగరం గ్రామంలో పేకాట ఆడుతున్న శిబిరంపై కొమరోలు ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ఆకస్మిక దాడి చేశారు. అల్లీనగరం గ్రామంలో పేకాటాడుతున్నట్లుగా పక్క సమాచారం అందడంతో కొమరోలు ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో సినిమా పక్కిలో ఆకస్మిక దాడి చేశారు. ఆ సందర్భంగా అక్కడ పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 10,580 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మండలంలో పేకాట, తదితర జూదాలను అరికట్టేందుకు దాడులు నిర్వహిస్తున్నట్లుగా ఎస్ఐ నాగరాజు తెలిపారు. అందులో భాగంగా అల్లినగరంలో శనివారం పేకాట ఆడుతున్న ముగ్గురిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొమరోలు కానిస్టేబుళ్లు నారాయణ, రాజేష్ రెడ్డి, అలీ తదితరులు పాల్గొన్నారు. జూదం, అసాంఘిక కార్యకలాపాలు, నాటు సారా తయారీ,విక్రయాలు గుట్కా విక్రయాలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని,చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగరాజు హెచ్చరించారు.

# నాణ్యమైన విద్యుత్ ను అందజేయడమే లక్ష్యం



**పొన్నలూరు పెన్ పవర్ జులై 4**

మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారు లకు పొన్నలూరు విద్యుత్ శాఖ తెలియజేయునది ఏమనగా అంతరాయములు లేని నాణ్యమైన విద్యుత్తు ఇచ్చుటయే లక్ష్యంగా పొన్నలూరు విద్యుత్ శాఖ పనిచేయుచున్నదని ఇందు నిమిత్తము అవసరం మేరకు నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయుచున్నామని ప్రస్తుతము ఉన్న పొట్టి పోల్స్ డ్యామేజ్ పోల్స్ ను మార్చుటకు ఏర్పాటు చేయుచున్నామని పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ మెరుగుపరిచేందుకు మీరు విద్యుత్ శాఖకు ఈ మూడు విషయాలపై తమ సలహాలు,సూచనలు తెలియజేయాలన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందా, సరైన వోల్టేజ్ తో విద్యుత్ అందుతుందా విద్యుత్ సిబ్బంది మీకు అందుబాటులో ఉన్నారా, అలాగే విద్యుత్ పై సమస్యలు ఉన్నచో ఫోను ద్వారా తెలియపరచి మీ సమస్యలు పరిష్కరించుకోవాల్సిందిగా కోరచున్నారు. పొన్నలూరు మండలం విద్యుత్ శాఖ ఏఈ ఫోన్ నెంబర్ 9440817500 సమాచారం కొరకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కందుకూరు టౌన్ సబ్ డివిజన్ రాఘవేంద్రరావు నంబర్ 9440817517 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ కందుకూర్ డివిజన్ అత్తంటి వీరయ్య నెంబర్ 9493174270 లకు ఫోన్ చేసి విద్యుత్ సమస్యలు తెలియజేయాలన్నారు. విద్యుత్ శాఖ వారితో సహకరించి నాణ్యమైన అంతరాయము లేని విద్యుత్ పొందవలసిందిగా విద్యుత్ శాఖ కందుకూరు రూరల్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారు తెలియజేశారు.

## నేడు కొమరోలులో తెలుగుదేశం పార్టీ బిఎల్ఎ, బూత్ ఇన్చార్జి ల సమావేశం

కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి నివాస గృహ ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు.





**కొమరోలు పెన్ పవర్ జూలై 4**

కొమరోలు మండలంలోని తెలుగుదేశం పార్టీ ఈఎల్ఏ ల బూతు ఇంచార్జిలతో ఈ నెల 4వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లుగా కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ కొమరోలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గత నెల 14వ తేదీ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభమైందని వారు తెలిపారు ఆ సందర్భంగా బిఎల్ఏలకు, బూత్ ఇన్చార్జిలకు ఎస్ ఐ ఆర్ పై పలు సూచనలు సలహాలు ఇవ్వడంతోపాటు పూర్తి అవగాహన కల్పించేందుకు వీలుగా సమావేశం ఏర్పాటు చేసినట్లుగా వారు చెప్పారు. సమావేశానికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి లేదా ఆయన సోదరులు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని, సమావేశానికి మండలంలోని బిఎల్ఏలు, బూత్ ఇన్చార్జీలు తప్పనిసరిగా నిర్ణీత సమయానికి హాజరుకావాలని వారి విజ్ఞప్తి చేశారు.

## శ్రీ నెమలిగుండ్ల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



**గిద్దలూరు (రాచర్ల), పెన్ పవర్ జూలై 4**

రాచర్ల మండలం నల్లమల అటవీప్రాంతంలోని సుప్రసిద్ధ శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. గోవింద నామ స్మరణతో నెమలిగుండ్ల క్షేత్రం మార్మోగింది. ప్రభాతవేళ ఆలయ అర్చక స్వాములు అభిషేకాది విశేష పూజాదికాలు నిర్వహించగా,భక్త జనులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శనివారం నాటి స్వామి వారి కైంకర్యాలలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు సిద్ధం నరసింహులు, సభ్యులు ,కార్య నిర్వాహణ అధికారి మల్లవరం నాగయ్య,అర్చక స్వాములు అన్నవరం పాండు రంగాచార్యులు, సత్యనారాయణాచార్యులు,రంగాచార్యులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కందుకూరు పసుపుమయం

## -ఏఎంసి పాలకమండలి ప్రమాణ స్వీకారం సందర్భంగా భారీర్యాలీ

## -ర్యాలీలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు





**కందుకూరు పెన్ పవర్, జూలై 4:**

కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి చైర్ పర్సన్ గా రాయపాటి సుభాషిని, మరో 15 మంది డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం కందుకూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి ఏఎంసీ ప్రాంగణం వరకు జరిగిన ర్యాలీలో తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ముందుగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఏఎంసి చైర్ పర్సన్ రాయపాటి సుభాషిని తదితరులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబూ జగజీవన్ రామ్, పూలే విగ్రహాలకు ఎమ్మెల్యే ఇంటూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద ఎమ్మెల్యే నాగేశ్వరరావును గుర్రంపై ఊరేగించారు. 11 గంటల ప్రాంతంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి ర్యాలీ మొదలైంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, నియోజకవర్గ పరిశీలకురాలు శ్రావణి రెడ్డి, ఏఎంసి చైర్ పర్సన్, డైరెక్టర్లు, మండల పార్టీల అధ్యక్షులు ప్రత్యేక వాహనంపై నిలబడి, దారిపొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కందుకూరు నియోజకవర్గ చరిత్రలో దళిత ఎస్సీ మహిళ, కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన రాయపాటి సుభాషినిని ఏఎంసి చైర్ పర్సన్ గా నియమిస్తూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నిర్ణయం తీసుకోవడం, దానికి అనుగుణంగా ప్రభుత్వం ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో... అన్ని గ్రామాల నుంచి దళితులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చారు. దళితులకు పెద్దపీట వేస్తూ, చైర్ పర్సన్ గా అవకాశం కల్పించినందుకు వారంతా ఎమ్మెల్యే నాగేశ్వరరావు కలిసి సంతోషంతో కృతజ్ఞతలు తెలియజేయటం స్పష్టంగా కనిపించింది. అనంతరం ఎమ్మెల్యేని ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి, మిఠాయిలు పంపిణీ





**ఉలవపాడు, పెన్ పవర్, జులై 04**

స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పుట్టినరోజును పురస్కరించుకొని టీడీపీ నాయకులు దోనెంపూడి నరసింహ విద్యార్థులకు విద్యా సామాగ్రి, మిఠాయిలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరేపల్లి తూర్పు ఎస్టీ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పలకలు, పుస్తకాలు పాఠశాల ఉద్యాయులకు అందజేసి, విద్యార్థులకు పంపిణీ చేసి, అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు దాతకు ధన్యవాదాలు తెలియజేసి, ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న యువ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నిరంతరం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నూరేళ్లు సంతోషంగా ఉండాలని కోరుకుంటూ, జన్మదిన శుభాకాంక్షలను స్థానిక టీడీపీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటి చైర్మన్ తాటితోటి ప్రభాకరరావు, నీటి సంఘం ప్రెసిడెంట్ పొట్టేళ్ల వెంకట కృష్ణ, ఎంపియూపి పాఠశాల చైర్మన్ వేములపాటి రాము, గ్రామపార్టీ ఉపాధ్యక్షులు ఓబుల్ నాయుడు, కుకింగ్ ఏజెన్సీ రమణమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

*మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు*





**పొదిలి, పెన్ పవర్, జులై 4**

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మర్రిపూడి మండల విద్యాశాఖ అధికారి యు. శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం నాడు ఆయన మండల కేంద్రమైన మర్రిపూడి లో గల ఏ ఏ పాఠశాల ను ఆకస్మిక తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులను పరిశీలించడంతోపాటు మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ఎం ఈ ఓ శ్రీనివాసులు ఆ పాఠశాలలో గల విద్యార్థులతోపాటు కూర్చుని భోజనం చేశారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి వారి కి అందుతున్న విద్యా సౌకర్యాలతో పాటు వివిధ అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యార్థుల కోసం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకున్న, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యం ఆర్ పి యస్ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చేయండి

### జిల్లా ఇంచార్జి వర్ల దేవదాసు మాదిగ



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జులై 4**

ఎస్సీ రిజర్వేషన్లను ఏబిసిడిలుగా వర్గీకరించి ఎస్సీ లోని 59 కులాలకు వారి వారి జనాభా దామాషా ప్రకారం సమాన పంపిణీ చేయాలని స్థాపించిన ఉద్యమం, వర్గీకరణ సాధించి జులై 7నాటికి 32వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మార్కాపురంజిల్లా కేంద్రంలో జరుగు ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చేయాలని మార్కాపురం జిల్లా ఇన్చార్జి వర్ల దేవదాసు మాదిగ విలేకురుల సమావేశంలోపిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యం ఆర్ పి యస్ ఆవిర్భావ సభకు ముఖ్య అతిథులుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, మరియు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రుద్రపోగు సురేష్ మాదిగ హాజరవుతారనిఅన్నారు. మాదిగలకు ఆత్మగౌరవంతో పాటు హక్కులు సాధించి వర్గీకరణ ద్వారా మాదిగ జాతికి వందేళ్ళ బంగారు భవిష్యత్తునిచ్చిన,అదేవిధంగా సమాజానికి ఆరోగ్యశ్రీ తో పాటు వికలాంగుల పెన్షన్ పెంచడం కోసం ఎస్సీ ఎస్టీలకు ప్రమోషన్ లో రిజర్వేషన్లు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కాపాడడం తో పాటు ఇలాంటి ఎన్నో మానవతా ఉద్యమాలు చేసిన మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవం సందర్భంగా సభలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గశీలోని అన్ని నియోజకవర్గాల తో పాటు మండలంలో ఉన్న ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి, అనుభవ సంఘాల నాయకులు మందకృష్ణ మాదిగ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గర్నెపూడి వినయ్ మాదిగ,ఎం ఈ ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చేదురి వెంకటేష్ మాదిగ, మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు చేదురి అశోక్ మాదిగ,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బరిగల దాసు మాదిగ, పీహెచ్పీఎస్ నాయకులు పెద్దమార్కుమాదిగ, ముండ్ల యలమంద మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో టి అజయ్ కుమార్



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 4**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక నమోదు ప్రక్రియను ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి తోట అజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సి.ఎస్.పురం బస్టాండ్ సెంటర్ లో రెవెన్యూ అధికారులు శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక నమోదు ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించి, ఓటర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణ, ఎన్యుమరేషన్ ఫారాల పరిశీలన, నమోదు పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో టి అజయ్ కుమార్ మాట్లాడుతూ, ఓటర్లు తమ వివరాల నమోదు చేసుకొనుటకు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి బిఎల్ఓ లతోపాటు ప్రత్యేక అధికారులను నియమించి అందుబాటులో ఉంచామని, రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు ఓటర్లందరూ నిర్లక్ష్యం చేయకుండా ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత సిబ్బందికి అందజేయాలని సూచించారు నిర్ణీత గడువులోపు నమోదు పూర్తి చేయని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నారు నమోదు ప్రక్రియను పారదర్శకంగా వేగవంతంగా నిర్వహించి నమోదు కు వచ్చే ప్రతి ఓటర్లకు అవసరమైన మార్గదర్శకాలు అందించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు శిబిరంలో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఎన్యుమరేషన్ ఫారాలను అధికారులకు సమర్పించారు ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ కె ధర్మ తేజ, మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, టిడిపి సీనియర్ నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు, రేనాటి వెంకటేశ్వర్లు, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ దుగ్గిరెడ్డి శివారెడ్డి, బిఎల్వోలు రాజశేఖర్, ప్రసాద్, జయప్రకాశ్, మౌనిక, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో పాల్గొన్న సాదు వెంకటేశ్వర్లు





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 4**

మండలంలోని రేగులచెలక గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ వెరిఫికేషన్ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సాదు వెంకటేశ్వర్లు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎల్ఓ ను వెరిఫికేషన్ ప్రక్రియ మరియు దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాదు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో విలువైనదని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదుకు అవసరమైన పత్రాలతో బిఎల్ఓ ను సంప్రదించి వెరిఫికేషన్ ప్రక్రియకు సహకరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రమేష్ , స్థానిక ఓటర్లు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించిన అమడసాని



**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 4**

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను గ్రామ పార్టీ అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓ ను ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, నమోదు పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని సూచించారు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలాధారమని, ఓటర్లు నమోదు కార్యక్రమానికి అవసరమైన ధ్రువపత్రాలతో బిఎల్వో లకు అందజేసి సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో బిఎల్ఓ కళారాణి, సోడా ఆదినారాయణ రెడ్డి, సందలూరి బాలకాశయ్య, దేవదానం, రాజారత్నం, కాలువ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణలో నిర్లక్ష్యం వద్దు

### తహసీల్దార్ మల్లికార్జున నాయుడు






**పుల్లలచెరువు పెన్ పవర్ జులై 4**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పుల్లలచెరువు తహసీల్దార్ నలగాటి మల్లికార్జున నాయుడు హెచ్చరించారు. శనివారం పుల్లలచెరువు మండలంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి వాటిని వెంటనే డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున, నిర్ణీత సమయంలోగా అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి బీఎల్వో కూడా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, పనిలో అలసత్వం లేదా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే మెమోలు జారీ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ మల్లికార్జున నాయుడు సూచించారు.

## రాజంపల్లిలో వైభవంగా శ్రీ గొ్ౕద్రాలికొండ తిరుమలనాథ స్వామి రథోత్సవం

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైసీపీ నేత తాటిపర్తి చంద్రశేఖర్‌రెడ్డి





**పెద్దారవీడు పెన్ పవర్ జూలై 4**

పెద్దారవీడు మండలం రాజంపల్లి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ గొ్ౕద్రాలికొండ తిరుమలనాథ స్వామి వారి వార్షిక తిరునాళ్ల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా జరిగిన వైభవ రథోత్సవంలో వైసీపీ నాయకుడు తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య సాగిన రథోత్సవంలో రథాన్ని లాగి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ, శ్రీ తిరుమలనాథ స్వామివారి కృప నియోజకవర్గ ప్రజలపై, రైతాంగంపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తిరునాళ్ల సందర్భంగా రాజంపల్లి గ్రామం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

## ఎస్ఐఆర్‌ను పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ విజయ సునీత





**కొనకనమిట్ల పెన్ పవర్ జూలై 4**

ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా,సమర్ధవంతంగా నిర్వహించి గడువులోగా పూర్తి చెయ్యాలని కలెక్టర్ విజయ సునీత అధికారులకు సూచించారు.మండలంలోని తువ్వపాడు,అంభాపురం తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పలు పంచాయతీల్లో ఎస్ఐఆర్ కార్యక్రమం అమలులో అధికారులు,సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.పనుల్లో అలసత్వం ప్రదర్శించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇంటింటికి వెళ్లి సిబ్బంది చేపడుతున్న వివరాల సేకరణ,ఫారాల పంపిణీ,డిజిటలైజేషన్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి గడువు తక్కువగా ఉన్నందున ప్రతి బీఎల్వో బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎలాంటి జాప్యం లేకుండా ఎన్యూమరేషన్,డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని తెలిపారు.ప్రజలు కూడా తమకు అందజేసిన ఫారాలను పూర్తిగా నింపి అవసరమైన ధ్రువపత్రాలతో కలిసి బీఎల్వోలకు సకాలంలో అందజేయాలని కోరారు.ప్రజల సహకారం ఉంటే సమగ్రమైన పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన సాధ్యమవుతుందని పేర్కొన్నారు.జిల్లా యంత్రాంగం సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలలో తహసీల్దార్ కె. కిషోర్ కుమార్ రెడ్డి,ఎంపీడీవో ఈశ్వరమ్మ,సంబంధిత శాఖల అధికారులు,బీఎల్వోలు,సిబ్బంది పాల్గొన్నారు.

# అద్దంకిలో తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యం

## రాజకీయాలకు అతీతంగా 'పల్నాడు హాస్పిటల్స్' సేవలు..

## త్వరలో విద్యాసంస్థల ఏర్పాటు: డాక్టర్ చింతలపూడి. అశోక్ కుమార్.

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 04:**

అద్దంకి పట్టణ ప్రజలకు తక్కువ ఖర్చుతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నూతనంగా నిర్మించిన 'పల్నాడు హాస్పిటల్స్' శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఆసుపత్రి అధినేత డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి, రమ్య హారిక దంపతులు ముందుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గృహప్రవేశం చేశారు. అనంతరం పలువురు వైద్యులు పాల్గొని రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి హాస్పిటల్‌ను లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. అద్దంకి వైఎస్సార్సీపీ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇక్కడ ప్రధానంగా వైద్య సేవల కొరత తీవ్రంగా ఉందని గమనించానన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఒంగోలు లేదా నరసరావుపేటకు తరలించాల్సి వస్తుందని, సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమస్యను పరిష్కరించే ఉద్దేశంతోనే ఆరు నెలల క్రితం ఇచ్చిన మాట ప్రకారం హాస్పిటల్‌ను నిర్మించి, నేడు ప్రజలకు అందుబాటులోకి తేవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైద్య సేవలను ఎట్టిపరిస్థితుల్లోనూ రాజకీయ కోణంలో చూడొద్దని, కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సామాన్యులకు అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని ఆయన స్పష్టం చేశారు.

**అత్యాధునిక సదుపాయాలు..**

టెలీ-మెడిసిన్ సేవలు పల్నాడు హాస్పిటల్స్‌లో ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాలతో పాటు క్రిటికల్ కేర్ వెంటిలేటర్ సదుపాయాలతో కూడిన ఎమర్జెన్సీ (అత్యవసర) సేవలు అత్యాధునిక టెక్నాలజీతో అందుబాటులో ఉన్నాయని డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. గుంటూరు, హైదరాబాద్ వంటి నగరాల్లోని పెద్ద



హాస్పిటల్స్‌తో అనుసంధానమై టెలీ-మెడిసిన్ ద్వారా ఎంతటి క్రిటికల్ కేసుకైనా ఇక్కడే మెరుగైన ట్రీట్‌మెంట్ అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి పేషెంట్‌ను సొంత మనిషిలా భావించి సేవలు అందిస్తామన్నారు.

**'మాతృదేవోభవ'.. జర్నలిస్టులు, సామాన్యులకు హెల్త్ కార్డులు.**

చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గతంలో జర్నలిస్టుల కుటుంబాలకు ఉచితంగా హెల్త్ కార్డులు అందించి వైద్య సేవలు చేశామని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో అద్దంకిలోని పాత్రికేయులందరికీ ఆరోగ్య పథకం ద్వారా హెల్త్ కార్డులు ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. సామాన్య ప్రజలకు కూడా తక్కువ ఖర్చుతో వైద్యం అందేలా ఒక ప్రత్యేక హెల్త్ కార్డు తీసుకురాబోతున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా స్త్రీ ప్రసూతి విభాగంలో సేవలు అందించేందుకు 'మాతృదేవోభవ' అనే పథకాన్ని



రూపొందించినట్లు వెల్లడించారు. ఈ పథకం కింద సాధారణ కాన్పు (నార్మల్ డెలివరీ) కు రూ.10 వేలు, ఆపరేషన్ కు రూ.12,500 కే చేయనున్నట్లు తెలిపారు. గర్భిణులు, చిన్నపిల్లలు ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అతి త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభిస్తామన్నారు.

**వచ్చే ఏడాది నాటికి విద్యాసంస్థల ఏర్పాటు..**

ప్రజలకు మేలు జరగాలంటే విద్య, వైద్యం అత్యంత కీలకమని డాక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. అవి రెండూ బలంగా ఉంటే కుటుంబంతో పాటు రాష్ట్రం కూడా బాగుంటుందన్నారు. అద్దంకిలో వైద్య సేవల కొరతను తీర్చినట్లే, విద్యా రంగాన్ని కూడా బలోపేతం చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి అద్దంకిలో ఒక అత్యుత్తమ స్కూలును ప్రారంభించి, స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్యను సైతం అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## కొమరోలు లోని ఎస్బిఎన్ఆర్ఎం పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

### అల్లూరి సీతారామరాజు వేషధారణలో అలరించిన చిన్నారులు.



**కొమరోలు పెన్ పవర్ జూలై 4**

స్వాతంత్ర సమరయోధులు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతోత్సవ వేడుకలను కొమరోలు లోని ఎస్బిఎన్ఆర్ఎం పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వై రేవతి అధ్యక్షత వహించగా పాఠశాల కరస్పాండెంట్ బంధుగుల నారాయణమ్మ ప్రధానోపాధ్యాయులు బంధుగుల వెంకటసుబ్బారెడ్డి, ఎస్ ఎల్ వి సొసైటీ వైస్ చైర్మన్ బంధుగుల వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా వేదికపై ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ బంధుగుల నారాయణమ్మ పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేవతి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు దేశభక్తిని పెంపొందించుకోవాలని స్వాతంత్ర సమరయోధుల జీవిత గాధలను తెలుసుకుంటూ వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు మహనీయుల త్యాగాల ఫలితంగా భారతదేశానికి స్వాతంత్రం లభించిందని అలాంటి మహనీయులను తలుచుకుంటూ వారికి నివాళులర్పించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంతోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులు అల్లూరి సీతారామరాజు వేషధారణలో హాజరై పలువురిని ఆకర్షించారు. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన వకృత పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు అందించి అభినందించారు. వేడుకలను తిలకించేందుకు విద్యార్థులు తల్లిదండ్రులు పరిసర వీధుల ప్రజలు తరలిరావడంతో పాఠశాల ఆవరణ కళకళలాడింది. విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఏపి జే ఏ సి ప్రకాశం జిల్లా కమిటీ

- జే ఏ సి ప్రాతినిధ్యపు లేఖను మంత్రి డాక్టర్ డోలా తో పాటు ప్రజా ప్రతినిధులకు అందజేత

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 04**



ప్రకాశం భవనం లో రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి (జే ఏ సి) పిలుపు మేరకు ప్రకాశం జిల్లా జే ఏ సి కమిటీ ఛైర్మెన్ కె శరత్ బాబు జిల్లా కన్వీనర్ షేక్ అబ్దుల్ హై ఆధ్వర్యంలో జిల్లా ప్రాతినిధ్యపు లేఖను సాంఘిక సంక్షేమ దివ్యాంగుల సీనియర్ సిటిజన్స్ స్వర్ణ గ్రామ శాఖామంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి , ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ , కనిగిరి శాసన సభ్యులు డా. ఉగ్రనరసింహా రెడ్డి, సంత నూతల పాడు శాసన సభ్యులు బి యన్ విజయ్ కుమార్ లను ఒంగోలు లోని ప్రకాశం భవనం లో అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తక్షణమే ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల మీద చర్చించాలని, 12వ పిఆర్సి కమిషన్ను వెయ్యాలని, తక్షణమే ఐఆర్ ప్రకటించాలని , హెల్త్ కార్డ్స్ పథకాన్ని సక్రమం గా అమలు జరిగేలా చూడాలని, ఉద్యోగులకు సరెండర్ లీవ్ డి ఎ ల బకాయిలు చెల్లించాలని, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, చనిపోయిన సిపియస్ కుటుంబాలకు 121 వ జీఓ కు సవరణ ఇస్తూ వారి కంట్రీ బ్యూషన్ వారికి చెల్లించాలని, పెన్షనర్లకు గత ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆటోమేటిక్ అడ్వాన్స్మెనెట్ స్కీం అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వ ఫథకాలలో భాగస్వామ్యం కలుగచేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులను కోరారు. పై సమస్య లు వెంటనే పరిష్కరించాలని జూలై 26 లోగా పరిష్కరించక పోతే రాష్ట్ర జే ఏ సి ఛైర్మెన్ అలపర్తి విద్యాసాగర్, సెక్రటరీ కె యస్ యస్ ప్రసాద్ నేతృత్వంలో



తదుపరి కార్యాచరణ కు రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమం లో ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ కో చైర్మన్ ఆర్ సి హెచ్ కృష్ణారెడ్డి,ఆర్ అంజయ్య, ఎం లక్ష్మీనారాయణ, బి శేషారావు, టి. శ్రీనివాసరావు, ఎన్ వి కృష్ణ, జి ఈశ్వర్ రెడ్డి, ఎం.కోటేశ్వరరావు, ఎన్ ఉదయలక్ష్మి, కే శ్రీనివాసరావు, జి శివ శంకర్, శ్రీ మహా విష్ణు,కే రామయ్య, బి అంకిరెడ్డి,కృష్ణ కిషోర్ కె శివకుమార్, వి శివ లీల,టి లింగయ్య, బి వై సుబ్బారెడ్డి, డి శ్రీనివాసులు, కె సత్యనారాయణ, పి రామాంజనేయులు, కొత్తపల్లి మంజేష్, షేక్ మగ్దుమ్ షరీఫ్, ఆర్ సి హెచ్ అంజయ్య, కె ప్రసాద రావు, షాలమ్ రాజు, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోహన్ రంగా సేవలు చిరస్మరణీయం

ఆకుపాటి వెంకటేష్, కొక్కిరాల సంజయ్ కుమార్




**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 4**

బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగా సేవలు చిరస్మరణీయమని ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్, జిల్లా కాపు జేఏసీ కన్వీనర్ కొక్కిరాల సంజయ్ కుమార్ అన్నారు. మోహన్ రంగా 79వ జయంతి సందర్భంగా శనివారం ఒంగోలులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆకుపాటి వెంకటేష్ మాట్లాడుతూ మోహన్ రంగా రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా ప్రజల మనిషిగా గుర్తింపు పొందారని అన్నారు. సామాన్యులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాటం సాగించారని కొనియాడారు. ప్రజల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, సేవాభావం కారణంగానే దశాబ్దాలు గడిచినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడిగా నిలిచారని పేర్కొన్నారు.అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సంక్షేమమే ఆయన ధ్యేయంగా పనిచేశారని, సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచి వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేశారని అన్నారు. మోహన్ రంగా సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకెళ్లాలని సూచించారు ఈ కార్యక్రమంలో రంగా అభిమానులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న అమడసాని బాలకేశవరెడ్డి

మండలంలోని కోవిలంపాడు పంచాయితీ మాజీ సర్పంచ్ ఎలికా వెంకటనారాయణ (ముసలయ్య) కుమారుడు శ్రీనివాసులు వివాహ వేడుకల్లో కోవిలంపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు దొనపాటి మోహన్, మాజీ ఉపసర్పంచ్ బాబురావు, దాసరి నారాయణస్వామి, నన్నసాని ప్రసాద్, గాంధీ, అంగిరేకుల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి సాధన దిశగా చర్యలు చేపట్టండి

## - అధికారులకు దిశా నిర్దేశం చేసిన మంత్రి డాక్టర్ డోలా, ఎంపీ మాగుంట,ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల, ఇతర ప్రజా ప్రతినిధులు







**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 04**

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని జిల్లాను అభివృద్ధి చేయడానికి అధికారులు మరింత దృష్టి సారించాలని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన అధ్యక్షతన ప్రకాశం భవనంలో ' దిశా ' సమావేశం జరిగింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన రావు, బి.ఎన్.విజయ్ కుమార్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ప్రకాశం, మార్కాపురం జిల్లాల జాయింట్ కలెక్టర్లు కల్పనా కుమారి, పులి శ్రీనివాసులు ఇందులో పాల్గొన్నారు. ఉపాధి హామీ, జల జీవన్ మిషన్, వ్యవసాయ, విద్యుత్, విద్య, పబ్లిక్ హెల్త్, జాతీయ రహదారులు, బివిఎస్ఎన్ఎల్, తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. జిల్లాలోని పరిస్థితులను పరిగణలోకి తీసుకొని అవసరమైన ప్రతిపాదనలు, నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడం ద్వారా నిధులను సమర్ధంగా వినియోగించుకోవాలని ఎంపీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మంత్రి స్వామి మాట్లాడుతూ జరుగుమల్లి నుంచి 16వ నెంబర్ రహదారిలోకి ప్రవేశించే ప్రదేశంలో ప్రమాదాలను నివారించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు పరిశీలించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. సాంకేతిక సమస్యలు ఉంటే సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు. రామతీర్థం నుంచి నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలపై తక్షణమే దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఒంగోలు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర నియోజకవర్గాలలో ఉపాధి హామీ పథకంలో మ్యాజిక్ డ్రైనేజీల పనులలో పురోగతి ఉందని, ఒంగోలు నియోజకవర్గంలో కూడా పనులను వేగవంతం చేయాలని అధికారులకు చెప్పారు. మేదరమెట్ల వద్ద ఉన్న మంచినీటి పథకం నుంచి ఒంగోలు నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలకు కూడా మంచినీటి సదుపాయం ఉన్నందున వాటి పైపుల మరమ్మతులు, కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తపట్నంలో జలజీవన్ మిషన్ పథకం కింద పనులను కూడా వేగవంతం చేయాలని అన్నారు. ఒంగోలు నగరంలోని కిమ్స్ ఆసుపత్రి వద్ద, దసరాజు పల్లికి వెళ్లే మార్గం వద్ద జాతీయ రహదారిలోకి ప్రవేశించే సర్వీస్ రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలని అధికారులకు చెప్పారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఉపాధి హామీ కూలీలకు పూర్తిస్థాయిలో వేతనాల చెల్లింపు జరగలేదని, త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏడుకొండలపాడు వద్ద జాతీయ రహదారిపై డ్రైనేజీ సరిగ్గా లేకపోవడం వలన వర్షపు నీరు నిలిచిపోతోందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. కనిగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని డీజీ పేట వద్ద తాగునీటి కాలువకు జాతీయ రహదారి అడ్డుగా వస్తుందని అన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా వీటిపై దృష్టి సారించి ముందుగానే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పలువురు జడ్పిటిసిలు, ఎంపీపీలు మాట్లాడుతూ జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట విద్యుత్ దీపాలకు మరమ్మతులు / కొత్తవి ఏర్పాటు చేయడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఉపాధి హామీ పథకం కింద పొలాలకు వెళ్లే డొంక రోడ్లను ఇది చేయాలని అధికార దృష్టికి తెచ్చారు.

కాగా, ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై సంబంధిత అధికారులు సమాధానం ఇచ్చారు. శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై మరింత దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, దిశా కమిటీ నామినేటెడ్ సభ్యులు కె. శ్రీనివాసరావు, బి.మార్క్ పాల్గొన్నారు.

# కొనిజేటి రోశయ్య ఓ దార్శానికుడు స్పూర్తి ప్రదాత

## వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జులై 4**

రాష్ట్ర రాజకీయ చరిత్రలో చెరగని సంతకంగా తనదైన ముద్ర వేసుకున్న మాజీ ముఖ్యమంత్రి, అపర చాణుక్యడు కొనిజేటి రోశయ్య ఓ దార్శానికూడని, స్పూర్తి ప్రదాత అని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం కొనిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ముఖ్యమంత్రి గా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్ గా ఉన్నత పదవుల్లో సేవలు అందించారాని,ఆర్థిక మంత్రిగా ఎన్నోసారు బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రజా రంజక పాలనలో రాష్ట్రాలను అభివృద్ధి పదంలో నడిపించిన ఘనత రోషయ్యకు దక్కిందని అన్నారు.శాసనసభ్యులుగా శాసనసభలో మాటల తుటాలతో ప్రతిపక్షాన్ని ముచ్చేమటలు పట్టించి తీరు రాష్ట్ర ప్రజలు మరచిపోరని, రోశయ్య వాగ్దాటి నేటితరం ఎమ్మెల్యే లకు స్పూర్తి దాయకం అని కొనియాడారు.నిరాడాంబరత, నిజాయితీ,ప్రజా జీవితంలో ఉన్నత విలువలకు ప్రతీక కొనిజేటి రోశయ్య అని కిర్తించారు. ఈ సందర్బంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి కూడా పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తి రెడ్డి, పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వనాథ్, మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి,జడ్పీటీసీ విజయ్ కుమార్,ఆర్య వైశ్య నాయకులు, ఐ వి సుబ్బారావు, సురే వెంకట రమేష్,ఐ వి సత్యనారాయణ,సురే వెంకట స్వామి, కందూరి గురు ప్రసాద్, కాకుమాను వెంకట సురేష్ బాబు,దోగిపర్తి సంతోష్ కుమార్,యక్కలి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటును అప్రమత్తంగా నమోదుచేయాలి



**గిద్దలూరు పెన్ పవర్ జులై 4**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు నియోజకవర్గంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మైల వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఫీల్డ్ స్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి తహశీల్దారు, యం. ఆంజనేయ రెడ్డి, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కమిషనర్, గిద్దలూరు మున్సిపాలిటీ ఈ.వి. రమణ బాబు, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ శ్రీ ఇబ్రహీం ఖలీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు బూత్‌ల పరిధిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించి, బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న దరఖాస్తుల పంపిణీ, స్వీకరణ నమోదు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చూడాలని, ప్రజలకు కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పిస్తూ నిర్దేశిత గడువులోగా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మైల వెంకటేశ్వర రావు తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఫీల్డ్ తనిఖీల ద్వారా సర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించి, కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన సూచనలు అధికారులకు అందించారు.

# మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్సీలు

## - విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై వినతి



**కందుకూరు పెన్ పవర్,జూలై 4**

రాష్ట్ర యువనేత, ఐటీ, ఎలక్ట్రానిక్స్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్సీ అశోక్ కుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై కూడా మంత్రితో చర్చించారు.విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రతినిధి బృందం కోరింది. రాష్ట్రంలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు చేపట్టడం, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే అంశాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగింది. ఈ అంశాలపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీలు తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసినట్లు సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు.

# గిద్దలూరు లో విద్యాభివృద్ధికి కృషి

## అదనపు తరగతి గదులు, పాఠశాలల అభివృద్ధికి నిధులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు హామీ

**గిద్దలూరు పెన్ పవర్ జులై 4**

గిద్దలూరు నియోజకవర్గ విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి విజ్ఞప్తిపై విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ నియోజకవర్గానికి పలు విద్యా అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు చేయడంతో పాటు మరిన్ని విద్యాసంస్థల ఏర్పాటుకు సానుకూల హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 32 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.8 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేయాలని అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించేందుకు ప్లేగ్రౌండ్‌లు, ఆటవస్తువుల అభివృద్ధి కోసం ఒక్కో పాఠశాలకు రూ.10 లక్షల చొప్పున 10 పాఠశాలలకు మొత్తం రూ.1 కోటి రూపాయలు అదేవిధంగా గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని కోరగా, వాటి మంజూరుకు మంత్రి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే అశోకరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గిద్దలూరు నియోజకవర్గ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ధీటుగా విద్యాబోధన చేసినందుకు గిద్దలూరు ప్రభుత్వ



పాఠశాల ఉపాధ్యాయులకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయాలతో గిద్దలూరు నియోజకవర్గంలో విద్యా మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం అవుతాయని , విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# న్యాయ సేవల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## -జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద్



**కందుకూరు పెన్ పవర్,జూలై 04:**

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ వారి సూచనల మేరకు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి క్యాలెండర్ యాక్టివిటీస్ లో భాగంగా నూతన న్యాయ సేవల శిబిరం అనే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ , జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. సత్యా నంద్ అన్నారు. శనివారం కందుకూరు పట్టణంలోని జనార్ధన స్వామి దేవాలయం ఆవరణలో చిల్డ్రన్ కోసం నిర్వహించిన వినూత్న తరహాలో నిర్వహించిన న్యాయ సేవలు శిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభిస్తూ చట్ట ప్రకారం పిల్లలకు కల్పించిన హక్కులను న్యాయస్థానాలు తూచా తప్పక పాటిస్తాయని అదేవిధంగా ఎటువంటి న్యాయ సహాయం అవసరమైన అర్హత కలిగిన వారికి న్యాయ సలహాలు, న్యాయ సేవలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, మండల న్యాయ సేవ అధికార కమిటీలు అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా పిల్లలకు చిన్నతనం నుండే చట్టాల పట్ల అవగాహన కలిగించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని భవిష్యత్తులో మంచి పౌరులుగా మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ నుండి అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని అదేవిధంగా న్యాయ సేవ అధికార సంస్థలు నిర్వహించే న్యాయ విజ్ఞాన సదస్సులకు విస్తృతమైన ప్రచారం కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి.. సీనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్. వి. రామకృష్ణ, కందుకూరు పట్టణ న్యాయస్థానానికి సంబంధించిన సీనియర్ సివిల్ న్యాయమూర్తి కే. కె. వి బుల్లి కృష్ణ, కందుకూరు పట్టణ డిఎస్పి బాలసుబ్రమణ్యం, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు దుర్గా కళ్యాణి, అన్నపూర్ణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీధర్ నాయుడు పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు.




# డిపిఆర్ ఓ రమేష్ కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి

## ఘన వీడ్కోలు పలికిన సిబ్బంది



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 04**

ప్రకాశం జిల్లా పౌర సంబంధాల శాఖాధికారి డిపిఆర్ఓ గా విశిష్ట సేవలందించి, అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడి)గా ప్రమోషన్ పై కడప జిల్లాకు బదిలీ అవుతున్న సందర్భంగా ఆయనకు సమాచార శాఖ కార్యాలయ సిబ్బంది శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో సిబ్బంది అందరూ కలిసి ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను బహూకరించారు. డిపిఆర్ఓ గా 2024 జనవరిలో ప్రమోషన్ పొంది ఆయన ఒంగోలుకు వచ్చారు.ఎంతో సవాలుతో కూడుకున్న ఎన్నికల విధులను అత్యంత సమర్థంగా నిర్వహించారు. ఆయన అంకితభావానికి గుర్తింపుగా అప్పటి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన ఉత్తమ అధికారి అవార్డును అందుకోవడం ఆయన పనితీరుకు నిదర్శనమని సిబ్బంది కొనియాడారు. విధుల పట్ల ఆయన చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, కార్యాలయ సిబ్బందితో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించిన తీరు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. మీడియా రంగానికి, ప్రభుత్వానికి మధ్య ఒక బలమైన వారధిగా నిలిచి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, జిల్లాలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారని గుర్తుచేసుకున్నారు. పనిని ప్రేమిస్తూ, సిబ్బందికి ఎల్లప్పుడూ దిశానిర్దేశం చేసే ఇంతటి ఉత్తమ అధికారి కడప జిల్లాకు బదిలీ కావడం ఒంగోలు సమాచార శాఖకు తీరని లోటని ఉద్యోగులు, సిబ్బంది ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన కడప జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డివిజనల్ పీఆర్ఓ దుర్గా ప్రసాదరావు, సీనియర్ అసిస్టెంట్ ధనలక్ష్మి, సమాచార శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.


# డిప్యూటీ సీఎం పవన్ వద్ద విద్యార్థిని విజ్ఞప్తికి స్పందించిన ఆర్టీసీ

## సర్పవరం జంక్షన్ నుంచి అదనపు బస్సు ఏర్పాటు

**కాకినాడ పెన్ పవర్, జూలై 04**

పిఠాపురం నుంచి కాకినాడలోని వీఎస్ఎల్ మహిళా డిగ్రీ కళాశాలకు వచ్చి వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కాకినాడ డిపో అదనపు బస్సు సర్వీసును ఏర్పాటు చేసింది. గత నెల 20న కాకినాడలో నిర్వహించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్వహించిన 'మాట మంతి' కార్యక్రమంలో పిఠాపురానికి చెందిన విద్యార్థిని సిద్ధాబత్తుల వైష్ణవి దేవి సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత సర్పవరం జంక్షన్ వద్ద బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు, ఈ నెల 6వ తేదీ నుంచి ప్రతిరోజూ సాయంత్రం 4.30 గంటలకు సర్పవరం జంక్షన్ నుంచి అదనపు ట్రిప్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు.

## బెంచ్‌పై కూర్చోబెట్టి విసిగించారు?.. అసంతృప్తిలో వైభవ్.. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో కొత్త చర్చ!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్‌తో జరగబోయే రెండో టీ20 మ్యాచ్‌కు ముందు 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ పెట్టిన ఒక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు తొలిసారి ఇండియాకు ఎంపికైన వైభవ్.. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇక ఈరోజు మాంచెస్టర్‌లో జరగబోయే రెండో మ్యాచ్‌కు ముందు వైభవ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో కొత్త అధ్యాయం అంటూ ఒక క్యాప్షన్‌ను జోడించాడు. దీంతో అతని నిరీక్షణ ముగిసిందని, ఈ మ్యాచ్‌తో అతను అంతర్జాతీయ క్రికెట్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడంటూ ఫ్యాన్స్ అనుకుంటున్నారు.

**ఇన్‌స్టా స్టోరీతో అరంగేట్రంపై క్లారిటీ:**

వైభవ్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ అరంగేట్రంపై ఆశలు రేకెత్తిస్తున్నప్పటికీ.. మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చేసిన వ్యాఖ్యలు మాత్రం అతడు మరికొంత కాలం వేచి చూడక తప్పదనే సంకేతాలు ఇచ్చాడు. ఇటీవల భారత్ గెలిచిన టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించిన సీనియర్ ప్లేయర్స్ కు అండగా నిలవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కఠినమైన పరిస్థితుల్లో జట్టును గెలిపించిన ఆటగాళ్లను బ్యాక్ చేస్తూనే, ఇక్కడి కండిషన్స్‌కు తగ్గట్టుగా టాప్ ఆర్డర్‌ను పటిష్టం చేయడమే తమ ప్రస్తుత లక్ష్యమని మోర్కెల్ పేర్కొన్నారు.

**వరల్డ్ కప్ హీరోలకే మేనేజ్‌మెంట్ ఓటు:**

2026 టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన సంజు శాంసన్, అభిషేక్ శర్మల ఓపెనింగ్ జోడీనే రెండో టీ20లోనూ కొనసాగించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ ఇంట్రెస్ట్ చూపుతోంది.ం

గత మూడు మ్యాచ్‌ల్లో శాంసన్ కేవలం ఒకే ఒక్క పరుగు చేసి ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్నప్పటికీ.. వరల్డ్ కప్ నాకౌట్ దశలో అతను ఆడిన వరుస మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌ల ట్రాక్ రికార్డ్‌ను బట్టి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అతనికి మరో ఛాన్స్ ఇవ్వాలని చూస్తున్నాడు. దీనివల్ల వైభవ్‌కు ఈ మ్యాచ్‌లోనూ నిరాశే ఎదురయ్యేలా కనిపిస్తోంది.

# సచిన్ రికార్డును బ్రేక్ చేసిన వైభవ్ సూర్యవంశీ.. 15 ఏళ్లకే భారత జట్టులో చోటు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయం స్టార్ట్ అయింది. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌తో వైభవ్ తన అద్భుతమైన ప్రయాణాన్ని మొదలు పెట్టడమే కాకుండా, భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట దశాబ్దాలుగా ఉన్న అరుదైన రికార్డును బ్రేక్ చేసేశాడు.



**సచిన్ రికార్డు కనుమరుగు:**

వైభవ్ సూర్యవంశీ డెబ్యూతో భారత క్రికెట్ చరిత్ర పుస్తకాల్లో ఒక మార్పు చోటు చేసుకుంది. దశాబ్దాలుగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ రికార్డు ఇప్పుడు కనుమరుగైంది. ప్రస్తుతం వైభవ్ 15 సంవత్సరాల, 3 నెలల, 7 రోజుల వయస్సులో ఇంగ్లాండ్ గడ్డపై డెబ్యూ చేశాడు. ఇక సచిన్ టెండూల్కర్1989లో 16 సంవత్సరాల, 205 రోజుల వయసులో పాకిస్థాన్‌పై అరంగేట్రం చేశారు. కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే బ్లూ జెర్సీని ధరించి, ఇంటర్నేషనల్ క్రికెట్ లోకి అడుగుపెట్టిన వైభవ్, భారత పురుషుల క్రికెట్ జట్టు తరపున ఆడిన అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడిగా (శీబఅస్త్రవర్ ×అఎఖుఅ జతీఱఎ౩ఎవ్వతీ) చరిత్ర పుటల్లో నిలిచాడు.

**ఐపీఎల్ నుంచి ఇంటర్నేషనల్ స్టేజీ వరకు:**

వైభవ్ సూర్యవంశీ ఈ స్థాయికి రావడానికి కారణం ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో అతను ప్రదర్శించిన అద్భుతమైన ఆటతీరు. రాజస్థాన్ రాయల్స్ తరపున బరిలోకి దిగిన ఈ టీనేజర్, టోర్నీలోనే అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అసాధారణ స్ట్రైక్ రేట్‌తో బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన వైభవ్, భారత సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఐర్లాండ్ పర్యటనలో ఛాన్స్ రాకపోయినా, ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టీ20లో బెంచ్‌కే పరిమితమైనా.. వైభవ్ తన శ్రమతో ఈరోజు తుది జట్టులో స్థానం సంపాదించుకున్నాడు.

**ఫ్యూచర్ స్టార్ క్రికెటర్:**

15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ ఒత్తిడిని ఎదుర్కొంటూ, దిగ్గజాల సరసన అరంగేట్రం చేయడం సాధారణ ముచ్చట కాదు. వైభవ్ సూర్యవంశీలోని ప్రతిభ, పోరాట పటిమ చూస్తుంటే, రాబోయే రోజుల్లో అతను భారత క్రికెట్‌లో మరెన్నో రికార్డులను సృష్టించడం ఖాయమని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ వండర్ కిడ్ అరంగేట్రంతో కోట్లాది మంది భారత అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

## వరల్డ్‌కప్‌లో అసలైన వార్ స్టార్ట్.. ఒక్కో మ్యాచ్ ఫైనల్‌లా.. రౌండ్ ఆఫ్ 16 పూర్తి షెడ్యూల్ ఇదే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ లో ఉత్కంఠభరితమైన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లు ముగిశాయి. ఇప్పుడు అందరి దృష్టి రౌండ్ ఆఫ్ 16 పైకి మళ్లింది. ప్రపంచకప్ ట్రోఫీ రేసులో ప్రస్తుతం 16 జట్లు మిగిలి ఉన్నాయి. ఈ రౌండ్ ఆఫ్ 32లో నాలుగు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన బలమైన జర్మనీని పరాగ్వే ఓడించడం, అలాగే నెదర్లాండ్స్‌పై మొరాకో పెనాల్టీ షూటౌట్‌లో విజయం సాధించడం ఈ టోర్నీలోనే హైలెట్ గా నిలిచాయి. ఇకపై ట్రోఫీని ముద్దాడటానికి జట్లు కేవలం నాలుగు విజయాల దూరంలో మాత్రమే ఉన్నాయి.




పోర్చుగల్ వర్సెస్ స్పెయిన్: జూలై 7న జరగబోయే ఈ మ్యాచ్ కోసం ఫుట్‌బాల్ ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. పోర్చుగల్ ఇప్పటివరకు ఒక్క ప్రపంచకప్ కూడా గెలవలేదు. క్రిస్టియానో రొనాల్డోకు ఇది చివరి ప్రపంచకప్ అయ్యే అవకాశం ఉండటంతో, ఈ లెజెండ్ కోసం కప్పు గెలవాలని పోర్చుగల్ కసితో ఉంది. అయితే, ప్రస్తుత ఫామ్ ప్రకారం స్పెయిన్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

అర్జెంటీనా వర్సెస్ ఈజిప్ట్: డిఫెండింగ్ ఛాంపియన్ అయిన అర్జెంటీనా ఇప్పటి వరకు ఈ టోర్నీలో ఓటమి లేకుండా దూసుకుపోతోంది. రౌండ్ ఆఫ్ 32లో కేప్ వెర్డే జట్టు అర్జెంటీనాకు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఎలాగోలా బతికి బయటపడింది. ఇప్పుడు వారు మహ్మద్ సలాకు చెందిన ఈజిప్ట్ జట్టుతో తలపడనున్నారు.

ఇంగ్లాండ్ వర్సెస్ మెక్సికో: డీఆర్ కాంగోను ఓడించి ఇంగ్లాండ్, ఈక్వెడార్‌పై గెలిచి మెక్సికో ఈ రౌండ్‌కు క్వాలిఫై అయ్యాయి. 1966 తర్వాత రెండోసారి ప్రపంచకప్ గెలవాలని ఇంగ్లాండ్ చూస్తుండగా, మెక్సికో తన క్వార్టర్ ఫైనల్ రికార్డును (1970, 1986) తిరగరాయాలని భావిస్తోంది.

ఇతర మ్యాచ్‌లు: ఫ్రాన్స్ జట్టు పరాగ్వేతో, బ్రెజిల్ జట్టు ఎర్లింగ్ హాలాండ్‌కు చెందిన నార్వే జట్టుతో తలపడనున్నాయి.

# నేచురల్ గ్లామ్ ఓవర్‌లోడ్... అనంతికా లేటెస్ట్ ఫోటోలు ట్రెండింగ్!





సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో తన సహజమైన నటనతో, క్యూట్ లుక్స్‌తో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది యంగ్ బ్యూటీ అనంతికా శనిల్‌కుమార్. ఇటీవల తెలుగులో వచ్చిన '8 వసంతాలు' సినిమాతో పాటు తమిళ చిత్రం 'పరిమళ అండ్ కో'తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ కేరళ కుట్టి, తాజాగా ప్రకృతి ఒడిలో చేసిన ఒక ఫోటోషూట్ నెట్టింట బాగా ట్రెండ్ అవుతోంది. సాంప్రదాయ ఆలివ్ గ్రీన్ చీరలో, ఎలాంటి హంగామా లేని నేచురల్ గ్లామ్‌తో అనంతికా ఒలికించిన హావభావాలు కుర్రకారు మనసులను దోచుకుంటున్నాయి.

**ప్రకృతి ఒడిలో అనంతికా సొగసులు:**

ఈ సరికొత్త ఔట్‌డోర్ ఫోటోషూట్‌లో అనంతికా చుట్టూ పచ్చటి చెట్లు, ప్రకృతి అందాల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. ఇక ఒక అందమైన దారిపై నడుస్తూ, పెదవులపై చెరగని చిరునవ్వుతో ఆమె ఇచ్చిన పోజులు చూసేవారికి ఫుల్ పాజిటివ్ వైబ్స్ ఇస్తున్నాయి. ఈ ఫోటోలలో ఆమె సింప్లిసిటీనే అందరికీ బాగా నచ్చేస్తోంది.

**ఆలివ్ గ్రీన్ చీరలో మోడ్రన్ టచ్:**

ఈ షూట్ కోసం అనంతికా ఎంచుకున్న డ్రెస్సింగ్ స్టైల్ చాలా సింపుల్‌గా, క్లాసీగా ఉంది. ఆమె కట్టుకున్న ఆలివ్ గ్రీన్ కలర్ హ్యాండ్లూమ్ లేదా బ్లాక్-ప్రింటెడ్ కాటన్ చీరపై ఉన్న చిన్న చిన్న ఎత్నిక్ డిజైన్లు చాలా బాగున్నాయి. ఇక దీనికి కాంబినేషన్‌గా వేసుకున్న ప్లెయిన్ బ్లాక్ స్లీవ్‌లెస్ బ్లౌజ్, డీప్ స్కూప్ నెక్ లైన్ ఆమె లుక్‌కి ఒక మోడ్రన్ టచ్ ఇచ్చింది.

**నో-మేకప్ లుక్.. మురిపిస్తున్న నవ్వు:**

ఈ ఫోటోషూట్‌కి అసలైన హైలైట్ ఏంటంటే, అనంతికా అసలు భారీ మేకప్ జోలికే వెళ్లలేదు. చాలా మినిమల్ మేకప్, సింపుల్ హెయిర్‌స్టైల్ మరియు ఎలాంటి భారీ ఆభరణాలు లేకుండా కేవలం చిన్న చిన్న జ్యువెలరీతోనే మెరిసిపోయింది. "అచ్చమైన పల్లెటూరి పిల్లను చూసినట్టు ఉందంటూ" నెటిజన్లు ఈ ఫోటోలకు హార్ట్ ఎమోజీలతో లైకుల వర్షం కురిపిస్తున్నారు.

**మలయాళం టు టాలీవుడ్ జర్నీ:**

మలయాళ సినిమాతో కెరీర్ స్టార్ట్ చేసిన అనంతికా శనిల్‌కుమార్, చాలా తక్కువ టైమ్‌లోనే సౌత్ మేకర్స్ దృష్టిలో పడింది. ఇక తన ఎక్స్‌ప్రెసివ్ కళ్లతో, సహజమైన యాక్టింగ్‌తో ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న రోల్స్ ఎంచుకుంటూ ఇండస్ట్రీలో ప్రామిసింగ్ హీరోయిన్‌గా ఎదుగుతోంది

.సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియా ద్వారా అభిమానులకు ఎప్పుడూ టచ్‌లో ఉంటుంది అనంతికా. ప్రకృతిని ఎంతగానో ప్రేమించే ఈ బ్యూటీ, తన మనసుకు నచ్చిన లొకేషన్లలో ఇలాంటి క్యూట్ ఫోటోషూట్స్ చేస్తూ నెటిజన్లను సర్ప్రైజ్ చేస్తోంది. మరిన్ని వైవిధ్యమైన ప్రాజెక్టులతో ఈ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ ముమ్ముందు మరెన్నో విజయాలు అందుకోవాలని ఆశిద్దాం..



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com